పదేళ్లయినా.. పట్టింపేదీ?

కోహీర్(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం.. పేద విద్యార్థులకు శాపంగా మారింది. మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన దిగ్వాల్ బీసీ హాస్టల్ పదేళ్లకే మూతపడింది. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరకపోగా రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన వసతిగృహం వినియోగానికి నోచుకోవడంలేదు. బీసీ హాస్టల్‌ను పున:రుద్ధరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని స్థానిక నాయకులు, విద్యార్థులు వాపోతున్నారు.


దిగ్వాల్ బీసీ హాస్టల్ భవనం

- వినియోగానికి నోచుకోని వసతిగృహం
- ఉత్సవ విగ్రహాలుగా భవనం గదులు
- విద్యార్థులకు శాపంగా అధికారుల నిర్లక్ష్యం
- వినియోగంలోకి తేవాలని స్థానికుల విన్నపం

కోహీర్ మండల పరిధిలో దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఒకప్పుడు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలను సాధించి జిల్లాలోనే మంచి పేరు తెచ్చుకొంది. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నప్పటికీ నేటికీ ఈ పాఠశాలలో అత్యధిక సంఖ్యలో 470 మంది విద్యార్థులు చదువుతుండటం విశేషం.

దిగ్వాల్ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు...

ఈ పాఠశాల సాధిస్తున్న ఫలితాలను చూసి సమీపంలోని చింతల్‌ఘాట్, కొత్తూర్(డి), వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లి, మద్రి, కవేలి, గురుజువాడ తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ దిగ్వాల్ పాఠశాలలో చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అంతేకాకుండా పక్కనే ఉన్న ఝరాసంగం మండలంలోని ఏడాకులపల్లి, చీలమామిడి, గిన్నియార్‌పల్లి, ఈదులపల్లి, దేవరంపల్లి మ్యాదపల్లి, చిల్కెపల్లితో పాటు వికారాబాద్ జిల్లా బామండ్ల పల్లెకు చెందిన విద్యార్థులు సైతం దిగ్వాల్ పాఠశాలలో అడ్మిషన్లు తీసుకున్నారు. అయితే ఈ గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ప్రాంతంలో వసతి గృహం ఏర్పాటు చేయాలని నాటి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లగా దిగ్వాల్ వెనుకబడిన తరగతుల వసతిగృహాన్ని నిర్మించింది.

20ఏళ్ల క్రితం హాస్టల్ ఏర్పాటు..

రెండు దశాబ్దాల క్రితం హాస్టల్ భవనాన్ని నిర్మించారు. ఇందులో విద్యార్థుల వసతి కోసం 10 గదులతో పాటు వంటగది, డైనింగ్‌హాల్, కార్యాలయం, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించి చుట్టూ ప్రహరీ నిర్మించారు. బీసీ హాస్టల్ అయినప్పటికీ వెనుకబడిన విద్యార్థులతో పాటు పరిమిత సంఖ్యలో షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల విద్యార్థులను సైతం హాస్టల్లో చేర్చుకున్నారు.

పదేళ్లకే మూత..

దశాబ్ద కాలం పాటు హాస్టల్ నిర్వహణ సక్రమంగానే సాగింది. కానీ.. వార్డెన్ స్థానికంగా లేకపోవడం, అవినీతి ఆరోపణలు రావడంతో సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆ తర్వాత హాస్టల్ నిర్వహణను అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో క్రమంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఉన్న కొద్దిమంది విద్యార్థులను జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విలీనం చేసి పదేళ్లకే దిగ్వాల్ హాస్టల్‌ను మూసివేసి చేతులు దులుపుకున్నారు.

హాస్టల్‌ను పున:ప్రారంభించాలి



కోహీర్ మండల పరిధిలోని ఆయా గ్రామాలతో పాటు ఝరాసంగం, మునిపల్లి, వికారాబాద్ ప్రాంతాల విద్యార్థులు దిగ్వాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. సమీప గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో చదువుకు దూరమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి మూతబడిన దిగ్వాల్ బీసీ హాస్టల్‌ను పునప్రారంభించాలని కోరుతున్నాం.

– రాందాస్, జెడ్పీటీసీ, కోహీర్ మండలం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

దిగ్వాల్ హాస్టల్ భవనాన్ని సందర్శిస్తాం. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుంటాం. బస్సు సౌకర్యం కల్పించే విషయమై ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. హాస్టల్ నిర్వహణకు అవసరమగు విద్యార్థుల సంఖ్యను తెలుసుకొని ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తాం.

– జగదీష్, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి

నామమాత్రంగా ఉపాధిహామీ ఆడిట్


మాట్లాడుతున్న అధికారులు

కొండాపూర్(సంగారెడ్డి): జాతీయ ఉపాధిహామీ పథకం పనుల్లో అవకతవకలు జరిగాయని ఆడిటింగ్ సిబ్బంది రిపోర్టులు ఇచ్చిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన 13వ సామాజిక తనిఖీ ప్రజాదర్బార్ నామమాత్రంగా కొనసాగింది. 2022 ఫిబ్రవరి నుంచి 2024 వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 12వ తేదీ నుంచి 21 వరకు క్షేత్రస్థాయిలో ఆడిట్ చేశారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి రికార్డులు ఇచ్చినా విజిలెన్స్ జిల్లాస్థాయి అధికారులు మాత్రం నామామాత్రపు సూచనలిస్తూ చర్యలు తీసుకుంటామన్నారు. చాలా గ్రామాల్లో రికార్డులు సరిగాలేవని, కొన్ని రికార్డులు, వ్యవసాయ పనులకు సంబంధించిన నిధులు ఖర్చు సరిగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాలకు నిధులు మంజూరైనా క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో పనులు జరగలేదన్నారు. ప్లాంటేషన్‌లో ఒక్కో మొక్క ఖరీదు నుంచి సంరక్షణ వరకు రూ.వందల నుంచి వేలు ఖర్చు చేసినా ఫలితం శూన్యమని ఆడిట్ సిబ్బంది వెల్లడించారు. రిజిస్టర్ మెయింటెన్స్‌ఆ ఫోటో అప్‌లోడ్, హాజరు, డిమాండ్ రిజిస్టర్, కూలీల చెల్లింపులో అవకతవకలు జరిగినట్లు గుర్తించినట్లు తనిఖీ అధికారులు తెలిపారు. ఎంపీడీవో, ఏపీవో సంతకాలు లేకుండానే బిల్లులు చెల్లించినట్లు రికార్డ్స్ ఇచ్చారన్నారు. సామాజిక తనిఖీల్లో ఒక్క ప్రజాప్రతినిధి కూడా పాల్గొనకపోవడంపై సర్వత్రా పలు అనుమానాలకు దారి తీస్తోంది. డీఆర్‌డీపీఓడీ జ్యోతి, ఏపీడీ బాలరాజు, సహాయ విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, అదనపు ప్రోగ్రాం, మండల ఉపాధిహామీ సిబ్బంది, కోఆర్డినేటర్ అంజగౌడ్, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మించేందుకు ఏర్పాట్లు

మునిపల్లి(అందోల్): బుదేరా పోలీస్‌స్టేషన్ సమీపం నుంచి విశ్రాంతి భవనం, ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ మీదుగా ప్రభుత్వ కళాశాల సీసీ రోడ్డు వరకు పనులు ప్రారంభించేందుకు అధికారులు మెటీరియల్ ఏర్పాటు చేయించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టేందుకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంజూరు చేశారు. మూడేళ్లుగా ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హైస్ నిరుపయోగంగా ఉంది. దీనిపై పలుమార్లు సాక్షి దినపత్రిలో కథనాలు రావడంతో అధికారులు స్పందించి ఆర్‌అండ్‌బీ గెస్‌హౌస్‌కు లైట్ల ఏర్పాటుతో పాటు విశ్రాంతి భవనం చుట్టు వివిధ రకాల ముళ్లపొదలను తొలగించారు. ఆరోగ్యశాఖ మంత్రి ఈ నెల 11వ తేదీన నిధులు మంజూరు చేయడంతో పాటు పనుల నిర్వహణకు శంకుస్థాపన చేసిన విషయం పాఠకులకు విదితమే. దీంతో విశ్రాంతి భవనం వినియోగంలో రావడంతో స్థానిక నాయకులు, అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమస్య పరిష్కారం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలోని ఆరో వార్డులో రోడ్డు సరిగా లేకపోవటంతో మాజీ వార్డు సభ్యురాలు నవ్య ఆధ్వర్యంలో గురువారం సొంత నిధులతో మట్టి పోయించి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. ఈ రోడ్డు గుండా రాకపోకలు ఎక్కువగా ఉండటంతో గుంతలు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకే సొంత నిధులతో మట్టి పోయించి సమస్యను పరిష్కరించినట్లు నవ్య తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

వట్‌పల్లి(అందోల్): అందోలు మండల పరిధిలోని పోసానిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. ప్రధానోపాధ్యాయులు అనసూయ మాట్లాడుతూ భవిష్యత్‌లో నాయకత్వ లక్షణాలు పెంచుకోవడానికి, క్రమశిక్షణతో మెలుగడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడుతాయన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జుట్టు నవీన్‌కుమార్, సునీత విద్యార్థులను అభినందించారు.

ఎమ్మెల్యే లాస్యనందితకు నివాళి


లాస్యనందిత చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం పట్ల శుక్రవారం వట్‌పల్లిలో దళిత సంఘాల నాయకులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆమె చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు జనార్దన్, అంబేడ్కర్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి దాసు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రకాశం, మాజీ వార్డుసభ్యులు మహేందర్‌గౌడ్, సుఖేందర్, ఖలీల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి


మాట్లాడుతున్న బ్యాంక్ ఉద్యోగులు

సంగారెడ్డి టౌన్: ఏపీజీవీబీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరుతూ బ్యాంకు ఉద్యోగులు సంగారెడ్డి పట్టణంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీజీవీబీ సెంట్రల్ కమిటీ మెంబర్ ప్రకాశం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం పెండింగ్‌లో ఉన్న అన్ని అలవెన్సులను ఇవ్వాలలన్నారు. గ్రామీణ బ్యాంకుల్లో పనిచేస్తున్న డైలీ వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

సంగారెడ్డి: కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ ఏపీజీవీబీ బ్యాంక్ ఉద్యోగులు ఒక్కరోజు సమ్మెలో భాగంగా సంగారెడ్డిలో ఏపీజీవీబీ రీజనల్ కార్యాలయం వద్ద ఆల్ ఇండియా రీజనల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ కమిటీ మెంబర్ ప్రకాశం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామీణ బ్యాంకులను కలిపి జాతీయ గ్రామీణ బ్యాంకుగా ప్రకటించాలన్నారు. సుప్రీంకోర్టు ఆర్డర్ ప్రకారం పెండింగ్‌లో ఉన్న అన్ని అలవెన్సులను ఇవ్వాలని సమ్మెలో శామ్యూల్, జాన్సన్, ఆఫీస్ అసిస్టెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అశ్విన్, రీజనల్ సెక్రటరీ రామకృష్ణ, ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ సెక్రటరీ రవికుమార్, రైటర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజనల్ సెక్రటరీ పద్మభూషణ్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండొద్దు


మాట్లాడుతున్న డీఈఈ లక్ష్మినారాయణ

జహీరాబాద్ టౌన్: వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో డీఈఈ లక్ష్మినారాయణ అన్నారు. పట్టణంలోని పీవీఆర్ గార్డెన్‌లో డివిజన్ పరిధిలోని ట్రాన్స్‌కో ఉద్యోగులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో పరిధిలో బోరుమోటార్లు అధికంగా ఉన్నందునా కరెంట్ డిమాండ్ ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. లోటు పాట్లు ఉంటే వెంటనే సరిచూసుకోవాలని, ముందస్తు సమాచారం లేకుండా కోతలు విధించవద్దని సూచించారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు ఉంటే వెంటనే వినియోగదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. విద్యుత్ సమస్యలపై నుంచి ఏవైనా ఫిర్యాదులు వస్తే స్పందించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏడీఏలు మధుసూదన్, రజనీకాంత్, ఏఈలు సతీష్, జగదీశ్వర్ లైన్‌మెన్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే విజయం తథ్యం

ఎంఈఓ దండు అంజయ్య


మాట్లాడుతున్న ఎంఈఓ అంజయ్య

సదాశివపేట(సంగారెడ్డి): పట్టుదల ఉంటే విజయం సాధించవచ్చని ఎంఈఓ దండు అంజయ్య అన్నారు. పట్టణ పరిధిలోని కేజీబీవీ పాఠశాలలోని బాలికలకు బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో పరీక్షలంటే బయపడొద్దు, మానసిక ప్రశాంతత ముఖ్యం అనే అంశంపై శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. విద్యార్థులు సమయ పాలన, కార్యదీక్షత వంటి మంచి లక్షణాలు అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మెడిటేషన్ చేయించారు. సమావేశంలో కేజీబీవీ ఎస్‌ఓ లత, సీఆర్టీలు, సీఆర్పీ రాజేశ్వర్ పాల్గొన్నారు.

టెండర్ రద్దు చేయాలని వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చికెన్‌షాప్‌ల యజమానులు

సంగారెడ్డి: పట్టణంలోని అల్ ఖురేషి సంగారెడ్డి చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చికెన్ వేస్టేజ్ టెండర్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ చికెన్‌షాపుల్లో కోళ్లను మొత్తం తామే కొంటాం కనుక చికెన్ వేస్టేజ్‌ను కూడా తామే అమ్ముకుంటామన్నారు. మున్సిపల్ అధికారులు వేధింపులు ఆపి చికెన్ వేస్టేజ్ టెండర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతరం డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో అల్ ఖురేషి సంగారెడ్డి చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ అజీజ్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఆరిఫ్ ఖురేషి, సెక్రటరీ మహమ్మద్ వాజిద్ ఖురేషి, ట్రెజరర్ మహమ్మద్ నయీమ్, అడ్వైజర్ మహమ్మద్ అబ్దుల్లా, కాంట్రాక్టర్ గౌస్, అసోసియేషన్ సభ్యులు, సంగారెడ్డి పట్టణ చికెన్‌షాప్ యజమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి టౌన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఇంగ్లీష్ మీడియంలో ఒకటో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధికారి అఖిలేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట స్కూల్‌లో రెండు, రామంతపూర్ స్కూల్‌లో ఒక సీటుకు అవకాశాలు ఉన్నాయన్నారు. సంగారెడ్డి జిల్లా నుంచి బాలబాలికల ఎంపిక చేసుకోవడానికి ఆసక్తి కలిగినవారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. యూకేజీ పూర్తి చేసిన వారు 2017 నుంచి 2018 మధ్య జన్మించిన పూర్తి సర్టిఫికెట్లతో ఈ నెల 24వ తేదీ నుంచి మార్చి 12వ తేదీ జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థినులకు పరుపులు పంపిణీ

జహీరాబాద్: ఝరాసంగంలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులకు డీసీసీబీ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి స్ప్రింగ్ పరుపులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన స్నేహితుడైన శ్రీమలానీ ఫ్రోమ్స్ సంస్థ డైరెక్టర్ అవినాష్ డాగా సహకారంతో విద్యార్థినులకు ఈ సాయం చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక సేవలో ఎంతో తృప్తి ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ పేద విద్యార్థులకు అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాధవి, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, ఎంపీటీసీ పురుషోత్తంరెడ్డి, నాయకులు విశ్వనాథ్, ఓంకార్, దుర్గయ్య, రాజుస్వామి, వేణుగోపాల్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సంజీవ్, శుభం పాల్గొన్నారు.

ఘనంగా సంత్ గాడ్గెబాబా జయంతి

నారాయణఖేడ్: ఉమ్మడి మెదక్ జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేశ్‌శెట్కార్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్‌లో వివిధ ప్రజాసంఘాల నాయకులతో కలిసి సంత్ గాడ్గెబాబా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల శుభ్రత, జీవహింస, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కుల, మతాల కతీతంగా మెలగాలని ఆకాంక్షించిన గాడ్గెబాబా జీవితం ప్రతిఒక్కరికి ఆదర్శనీయన్నారు. అదేవిధంగా విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అంజాగౌడ్, అలిగెజీవన్, భీంసేనా, ఓంకార్, చందర్‌నాయక్, బక్షిరాం తదితరులు పాల్గొన్నారు.

నక్షబాట కబ్జాపై ఫిర్యాదు


ఫిర్యాదుపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని పల్పనూరు గ్రామ శివారులో నక్షబాటను కబ్జా చేస్తున్న పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు పల్పనూరు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ శివారులోని సర్వేనెంబర్ 291లో ఉన్న 33 పీట్ల నక్షబాటను మూడేళ్ల క్రితం ప్రభుత్వ సహకారంతో133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మండల పరిషత్ స్కూల్ వరకు మట్టి రోడ్డును వేసినట్లు తెలిపారు. కానీ ఓ పరిశ్రమ యాజమాన్యం ఈ రోడ్డును కబ్జా చేసి ప్రహరీ నిర్మించిందని ఆగ్రహం చేశారు. తక్షణమే ప్రహరీని తొలగించి గ్రామంలోకి వాహనాలు రాకపోకలకు 45పీట్ల రోడ్డును వదులాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌ఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

పన్నులు వసూలు చేయండి

కోహీర్(జహీరాబాద్): గడువులోపు వంద శాతం పన్నులు వసూలు చేయాలని డీఎల్‌పీఓ అమృత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. కోహీర్ ఎంపీపీ కార్యాలయంలో కార్యదర్శులతో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామాలకు వెళ్లి తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పీఎం విశ్వకర్మ దరఖాస్తులను పరిశీలించాలని ఆదేశించారు. కరెంటు బిల్లులు సకాలంలో చెల్లించేవిధంగా చూడాలన్నారు. పారిశద్ధ్య కార్మికుల జీతాలను ప్రతి నెల మొదటి వారంలో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఎంపీఓ రఘు పాల్గొన్నారు.

పన్నుల వసూలుపై శ్రద్ధ వహించాలి

హత్నూర(సంగారెడ్డి): గ్రామ పంచాయతీల పన్నులను వసూలు చేసేందుకు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని డీఎల్‌పీఓ అనిత అన్నారు. హత్నూర రైతువేదికలో మండలంలోని గ్రామ గ్రామపంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టడంతో పాటు పారిశుద్ధ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

◆ అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

హత్నూర(సంగారెడ్డి): నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా చెరువుకుంటలో నుంచి మట్టి, మొరం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ హెచ్చరించారు. మండల కేంద్రమైన హత్నూరలోని ఓ కుంటలో నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఘటనాస్థలానికి చేరుకుని జేసీబీ, ట్రాక్టర్‌ను ఆధీనంలోకి తీసుకొని జేసీబీకి రూ.5వేలు, ట్రాక్టర్‌కు 2000 చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.


◆ పెద్దారెడ్డిపేటలో వైద్యశిబిరం

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేట గ్రామంలో శుక్రవారం కాంటినెంటల్ ఆసుపత్రి వారు గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో 100మందికి పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి గుండె జబ్బులు ఉన్నట్లు గుర్తించారు. వీరికి ఆరోగ్య శ్రీకార్డు ద్వారా గుండె శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామని కార్డియాలజిస్టు డాక్టర్ మూర్తి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ అవిశ్వాస ఎన్నికపై కోర్టు స్టే?

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్‌పై బీఆర్‌ఎస్ నేతలు అవిశ్వాసం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నెల 26 అవిశ్వాసంపై ఎంపీటీసీలతో సమావేశం జరగాల్సి ఉంది. అవిశ్వాస ఎన్నికపై హైకోర్టు స్టే ఇచ్చిందనే ప్రచారం మండలంలో జరుగుతోంది. మరో రెండు రోజుల్లో అవిశ్వాస సమావేశం జరగాల్సి ఉండగా హైకోర్టు స్టే ఇవ్వటంపై ఏం జరుగుతుందోనని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు చర్చలు జరుపుతున్నారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు చెందిన ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు క్యాంపులో ఉన్నారు. ఈ విషయమై ఆర్డీఓ రవీందర్‌రెడ్డిని వివరణ కోరగా కోర్టు స్టే ఇచ్చిందనే సమాచారం ఉంది కాని ఇంకా తమకు కోర్టు పత్రాలు అందలేదన్నారు.

◆ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి


తిరుపతిరెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో న్యాల్‌కల్ మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి చోటుదక్కింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. కమిటీలో మండల పరిధిలోని మెటల్‌కుంట గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. న్యాల్‌కల్ మండలానికి మొదటిసారిగా వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉపాధ్యక్ష పదవి దక్కింది. తిరుపతిరెడ్డి 2001 నుంచి 2006 వరకు సర్పంచ్‌గా పని చేశాడు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో మెటల్‌కుంట గ్రామం నుంచి 233 ఓట్ల మెజార్టీ వచ్చేలా తిరుపతిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. ఆయన పనితీరును గుర్తించి ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు సమాచారం. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి తెలిపారు.

◆ ఘనంగా మల్లికార్జునస్వామి జాతర

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని నల్తూర్ గ్రామంలో బ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, నాయకులు చంద్రారెడ్డి తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ కాంగ్రెస్‌లో చేరిక

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లోని బీఆర్‌ఎస్ నాయకుడు మహేశ్‌కుమార్ కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్‌గౌడ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహేశ్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

◆ 32 మందికి జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు కోర్టు జరిమానా విధించినట్లు పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం, గురువారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 32 మంది పట్టుబడ్డారని పేర్కొన్నారు. వీరిని శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 32 మందికి ఒక్కొక్కరికీ రూ.1,000 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

◆ జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

ఝరాసంగం(జహీరాబాద్): జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన ఝరాసంగం గ్రామానికి చెందిన కడమంచి అంబమ్మ(62) భర్త విడిచి పెట్టడంతో ఝరాసంగంలోనే ఉంటూ కేతకీ ఆలయ ఆవరణలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తోంది. ఒంటరితనం భరించలేక శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లి మండల పరిధిలోని జీర్లపల్లి గ్రామ శివారులోని చెరువులోదూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఉరివేసుకొని...

పుల్‌కల్(అందోల్) : ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య చేసకున్న ఘటన మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పెద్దాగొల్ల పుష్పలత(45) భర్త ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటుంది. గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


◆ వ్యక్తి అదృశ్యం

నారాయణఖేడ్: మానసిక పరిస్థితి సరిగాలేని వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖేడ్ మండల పరిధిలోని పీర్లతండాకు చెందిన వడిత్యావెంకట్‌కు గత కొంత కాలంగా మానసిక పరిస్థితి బాగాలేదు. అతను పశువులను కాస్తుంటాడు. ఈ నెల 21న ఉదయం వెంకట్‌ను అతడి తల్లి చాందీబాయి పశువులను మేపడానికి తీసుకెళ్లాలని చెప్పగా వెళ్లనని మొండికేయగా మందలించడంతో ఇంటినుంచి వెళ్లిపోయాడు. అప్పటినుంచి తిరిగి ఇంటికిరాలేదు. దీంతో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో చాందీబాయి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ చికిత్స పొందుతూ మహిళ మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ మహిళా మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమణ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా కోటనెమలిపురి గ్రామానికి చెందిన శిరీష-ప్రసన్నకుమార్‌కు 16 నెలల క్రితం వివాహం జరిగింది. అయితే వీరికి 5 నెలల బాబు ఉన్నాడు. 9 నెలల క్రితం బతుకుదెరువు కోసం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బంధంకొమ్ముకు వచ్చి ఓ అపార్టుమెంటులో వాచ్‌మెన్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో 22వ తేదీన బాబు స్నానం కోసం కట్టెల పొయ్యిపై నీళ్లు వేడి చేస్తున్న క్రమంలో కార్సెంట్ ఆయిల్ పోయడంతో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో శిరీష నైటీ అంటుకొని తీవ్రంగా గాయపడింది. వెంటనే చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతురాలి తల్లి సువార్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్నారు.

◆ ఆటోడ్రైవర్ అదృశ్యం


ఖలీల్‌పాషా

జిన్నారం(పటాన్‌చెరు): ఆటోడ్రైవర్ అదృశ్యమైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గుమ్మడిదల ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన ఎండీ ఖలీల్‌పాషా ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 22న ఇంటినుంచి వెళ్లిన ఖలీల్‌పాషా తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఖలీల్‌పాషా భార్య సుగ్రాబేగం శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.